# రాబందు

పాలడుగు వెంకటేశ్వరరావు

ఎండ చుర్రున కాలుస్తున్నది. గాలి ఆడటంలేదు. కొండ ఆవిర్లు గక్కుతున్నది. కొండ అంచున మెలికలు తిరిగిన తారురోడ్డుమీద-రిక్షా భారంగా నీరసంగా సాగుతున్నది. రిక్షాలాగుతున్న బక్కయ్య వళ్ళు చమటకి ముద్దగా అయింది. బక్కయ్య నడుముకి చుట్టుకున్న పంచా, పై బనీనూ పూర్తిగా తడిసిపోయేయి. బక్కయ్య ఆయాసంతో రొప్పుతున్నాడు.

తాపీగా రిక్షాలో కూర్చునివున్న లావుపాటి శాస్త్రి, లాల్చీజేబులోంచి సిగరెట్టుపెట్టె బయటికితీసి సిగరెట్టు వెలిగించుకుని గుప్పుగుప్పున పొగ వదిలేడు. వదిలి—

"నిన్నే! రోజుకి ఎంతసంపాస్తావు?"— అని అడిగేడు అరాగా.

వగరుస్తూ రిక్షాలాగటంలో మునిగివున్న బక్కయ్య ఆ మాట వినిపించుకో లేదు.

"నిన్నే! వినబట్టంలా?!" గట్టిగా అరిచాడు రిక్షాలో కూర్చునివున్నతను.

బక్కయ్య వెనుదిరిగిచూసాడు ఆ అరుపుకి

"నిన్నే అడుగుతున్నా. రోజుకి ఎంత సంపాస్తావు?" అని మళ్ళీ అడగగా- 'బాగా' బేర్లాలు తగిల్తే పదో పదకొండో మిగుల్తాయండి-' రొప్పుతూ జవాబు చెప్పాడు బక్కయ్య.

"బేరాల్తగలకపోతే....?"

"అంతే సంగతులండి. ఇక చేసేదేంలేదుగందా!"

"పాపం!- పిల్లలెంతమందీ?"- నిట్టూర్చాడు కొళ్ళనుదారు.

"ఆరుగురండి. భార్యా తల్లిదండ్రులూ అంతాగలిపి పదిమందిమండి"

"అద్దె ఎంతగట్టాలీ రిక్షాకీ?"

"పన్నెండుగంటలకయితే పదిరూపాయలండి. ఇరవయినాల్గగంటలయితే పదేనండి."

'ప్చ్! మీ శ్రమశక్తిని ఆ రిక్షాయజమానులు దోచుకుంటున్నారోయ్.

బక్కయ్య మారుమాటలేకుండా రిక్షాని 'అప్పు' ఎక్కించటానికి కండలు కరిగించే శ్రమదానంలో మునిగిపోయాడు.

'చిన్నదా? చితకదా?! పదిమందిగల సంసారమే! దాన్ని ఈ రోజుల్లో ఎట్లా లాక్కువస్తున్నావయ్యా? నిన్నుజూస్తే జాలివేస్తావుంది! నీలాంటి శ్రమజీవులు సంఘటితమయినట్లయితేనే మిమ్మల్ని దోపిడీచేసేవాళ్ళని ఎదుర్కొని— పోరాడి— మీ హక్కుల్ని మీరు సాధించుకొనవచ్చునయ్యా. ఆసంగతి దెలుసుకోండి ముందు?

అప్పు ఎక్కిన రిక్షా వాలున గిరగిరా జారిపోసాగింది.

"నామాటలు నీవు వినిపించుకోలేదా?"— '....'

"అంతమందీ ఎక్కడవుంటున్నారయ్యా? పాపం!"

'గుడిసెలపేటలోనేనండి.'

"ఆ మురికి కూపంలోనేనా! అక్కడ ఏటా అగ్నిప్రమాదాలు జరుగుతాయంటారుగదా?"

'ప్రమాదాలుకాదండి అయ్యా.'

"మరేంటంటావు? నాకు తెలవకడుగుతాలే—"

"పనిలేని కొందరు దొంగనాయాళ్ళు రవుడీల్ని పెట్టి గుడిసెల్ని కావాలనంటిస్తారండి. ఇది అందరికీ తెలిసిన రహస్యమే."

ఆమాటకి - లావుపాటి శాస్త్రి వులిక్కిపడ్డాడు. అంతలోనే తమాయించుకుని- అయినా మీలాంటి పేదోళ్ళ ఇళ్ళకి నిప్పంటించటాన్కి — అంత పాపం మూటగట్టుకోవటాన్కి— ఆళ్ళు రాక్షసులా? ఏంటీ చెప్పుమరి."

"ఆళ్ళు రాచ్చసులేనండి. మనుషుల్ని పీక్కునిడినే రాచ్చసులండి."

"సర్లే. నాకెందుగ్గానీ, ఒక్కసారి రిక్షా ఆపు. దాహంగావుంది. డ్రింకు తాగుతానూ."

రిక్షా ఆగింది. దిగి బక్కయ్య మొహంతుడుచుకున్నాడు. "ఆ బడ్డీకొట్లో కూల్డ్రింకు తెచ్చిపెట్టావా ? నాకూ ?" బక్కయ్య వెళ్ళి డ్రింకుతెచ్చాడు అది అందుకుని అతను కూల్డ్రింకు తాగటం అయ్యాక రిక్షా మళ్ళీ సాగింది—మరొక సిగరెట్టు వెలిగించి, "నా ప్రశ్నకి నువ్వు జవాబుచెప్పలేదు మరి!" అన్నాడు.

"ఏమిటండి?" అన్నాడు బక్కయ్య.

"మీ రిక్షా కార్మికులందరూ ఒక యూనియన్ పెట్టుకోండి. నెలకి తలా ఒక్కరూపాయా చందాకట్టుకోండి. ప్రెసిడెంటుని పెట్టుకుంటే మీ హక్కులకోసం గట్టి పోరాటం సాగించవచ్చును. ఏమయినా సంఘర్షణతోనే సాధించవచ్చును— ఎన్నెన్నో చేయవచ్చును "

"........."

"ఏం మాట్లాడవూ?"

"ఏం చెప్పమంటారు?"

"నేనడిగింది బాగావుందా, లేదా? నీకు అర్థమయిందా?"

"బాగానేవుండిగానండి, మీరు హక్కులూ పోరాటాలదాకా పోతావున్నారు! అసలు మీరెవరండీ? అది చెప్పండి నాకు."

"నాపేరు పానయ్య. నేను లీడర్ని. మీరు అట్టా ఒక సంఘాన్ని పెట్టుకుని నన్ను ప్రెసిడెంటుగా ఎన్నుకుంటే నేను మీదరవున పోరాడతాను. మీకు న్యాయం జరిగేలాగా చూస్తాను."

"పానయ్యగారూ! న్యాయంఅంటే ఏమిటండి అసలూ?!" అని బక్కయ్య ప్రశ్నవేయగా కొన్ని క్షణాలు నిరుత్తరుడైన పానయ్య తమాయించుకుని— 'ఈ ప్రపంచకంలో డబ్బువున్నవాడు మరింత పోగుచేసి బలుస్తున్నాడు! పేదవాడు కూటికీ గుడ్డకీ నీడకీ అల్లాడిపోతావున్నాడు. అందుక్కారణం దోపిడీ. దాన్ని అరికట్టకపోతే—మనలాంటివాళ్ళు అన్యాయమయిపోతారు...."

"ఇంతకీ నేనడిగింది...."

"వస్తున్నా. వస్తున్నా. ఉదాహరణకి నీవున్నావు; నీ సంసారంవుంది; నీవు ఆ సంసారాన్ని పోషించుకోవటాన్కి రెక్కలు ముక్కలుచేసుకుని కష్టపడుతున్నావు. నీ కష్టానికి తగిన ప్రతిఫలం నీచేతికి అందుతూవుందా? అదీప్రశ్న."

"దానిసంగతి అట్లావుంచండిబాబూ, మా బాధలు ఏమిటి చెప్పమంటారు? వుంటానికి గుడిసెలమామూలు.' కాదంటే గుడిసెలు తగలబడతాయ్. అగ్నిప్రమాదాలని పేరు! ఆపైన పోలీసుమామూళ్ళు. కాదంటే రిక్షా నడపలేము. ఆ తర్వాత— పేటలో రవుడీమామూళ్ళు. అది చెల్లించకపోతే ఆవాడలో వుండలేము. ఇట్లా ఎన్నో రకరకాల దోపిడీలు. ఇవన్నీ ఇట్లా వుంచుకుని ఏదో హక్కులూ- అంటూ ఆకాశంలోకి ఎగరమంటారేంటి బాబూ ?'

"అదేనోయ్! నేననేదీ, అదే! నీవు కండలు కరిగించి కష్టపడి సంపాదించుకున్నటువంటి ఆ సంపద ఇట్లా రకరకాలుగా దోపిడీకి గురవకుండా వుండాలంటే నీవు పోరాటం సాగించాలి. అందుకు నీవంటివాళ్ళందరూ సంఘటితమవాలి. అవగాహన పెంచుకుని ఆలోచన్లుచెయ్యాలి....'

"ఏం పోరాటంలెండి! ఆ పేరుజెప్పికూడా మాయజేసి మమ్మల్ని మరొక

సారి దోచుకునే జాతి వకటి తయారయ్యింది ఈమధ్యన—''

పానయ్య తెల్లబోయాడు.

'ఏంటీ నువ్వనేదీ? నాకర్థంకావటల్లేదు!' అన్నాడు తడబడి.

"సర్లెండి. మా బాధలు ఎవ్వరికీ అర్థమయ్యేవీగావు. ఈనాటికి తీరేవీగాదు గాని- మీరుజెప్పిన సెంటరొచ్చింది. ఇక్కడ దిగుతారా?"

'ఆ కుడివయిపు బజార్లో రెండోమేడదగ్గర ఆపు'

రిక్షా కుడివయిపుకి తిరిగి, కొత్తగా రంగులువేసిన, అందంగా మెరిసిపోతున్న మేడముందు ఆగింది. అతి కష్టంమీద రిక్షాలోనుండి శరీరాన్ని క్రిందికి దింపి, ఆయాసంతో వగర్చాడు పానయ్య.

కండవాతో మొహానున్న చమటల్ని తుడుచుకుంటూ నిలబడ్డ బక్కయ్యని చూసి మందహాసంచేసి—

"చూడుబాబూ! ఇవాళ నీ పరిచయమయి — నీతో కొన్ని అతిముఖ్యమయిన విషయాల్ని ముచ్చటించినందుకు నాకు చాలా సంతోషంగావుంది. నేను ఎల్లప్పుడూ ఈవిషయాన్నిగురించే ఆలోచించి తాడితులను పీడితులను బాధాసర్పదష్టులను, వుద్ధరించే ప్రయత్నాల్లోనే మునిగివుంటాను. నేనుచెప్పిన విషయం గురించి ఆలోచించు- ఆలోచించి, నీ మిత్రులతో కూడా సంప్రదించు. వకనిర్ణయాన్కి వచ్చినట్లయితే — నీవుగానీ, మరెవరయినా కార్మికసోదరులుగాని, ఏవేళప్పుడయినా—నాదగ్గరికివచ్చి ఈ మేడలో నన్ను కలుసుకొనవచ్చును. ఈ తలుపులు నీవంటివారికోసం ఇరవయినాలుగ్గంటలూ తెరిచేవుంటాయి.... అసలు నా జీవితాన్ని నేను మీ కార్మికులకే అంకితంచేసాను"...అని లోపలికి అడుగులు వేసాడు గంభీరంగా.

బక్కయ్య అతన్ని అనుసరించగా అది గమనించి— ఆగి—

"నాతో ఇంకా ఏయినా చెప్పుకోవాలనుందా బ్రదర్?" అన్నాడు పానయ్య ఆప్యాయతను చిలకరిస్తూ.

బక్కయ్య నోరు తెరిచేలోగానే—

అవునూ. అన్నట్లు ఒకటడగటం మర్చిపోయానూ! కేవలం నీవక్కడి సంపాదనమీద— దాన్నీ ఎవడికందిందాన్ని వాడు దోచుకుని తింటాడన్నారుగదా- మీ పదిమందీ ఎట్లా బ్రతుకుతున్నారయ్యా ఈ రోజుల్లో....!"

బక్కయ్య చిర్నవునవ్వాడు వేదాంతిలాగా.

"అయ్యా! మా ఇంటిది పదిఇళ్ళల్లో పాచిపనిచేస్తుందండి. కుర్రాళ్ళిద్దరూ ఏవో చిల్లరపన్లుచేస్తారు. అమ్మాయిలు మిషన్లుకుడతారు. ఇట్లా అందరం తలోపనీ చేసుకుని ఎంతోకొంత సంపాదించుకుంటామండి. ఏదో-కూటికీ గుడ్డకీ సరిపెట్టుకుని రోజులు వెళ్ళదీస్తావున్నాం."

"సెబాష్! మీవంటి శ్రమపాటవాన్ని గుర్తెరిగిన శ్రామికులని చూస్తే అందుకే నా శరీరం సంతోషంతో వుబ్బిపోతుందయ్యా.' అని తన సంతోషాన్ని వెల్లడించి, వెనుదిరిగి నాలుగడుగులు వేసాడు పానయ్య మళ్ళీ.

అంతలోనే ఏదో అనుమానంవచ్చి-వెనుదిరిగి- తనని అనుసరించివస్తూవున్న బక్కయ్యని గమనించి ఆగాడు పానయ్య.

"ఇంకా ఏమికావాల మిత్రమా?" అని అడిగాడు స్నేహంగా.

"నారిక్షా కూల్డబ్బులండి! అని బక్కయ్య అడగ్గా-పకపక నవ్వి- 'అవునూ! నేను ఆ సంగతే మర్చిపోయాను. నీకు డబ్బులు ఇవ్వాలిగదూ! నీవు కష్టజీవివి- నేను నీవంటి వారికోసరం పాటుబడే పోరాటవర్గ జీవినీ- మన్లోమనకి ఏంటిగానీ, నీవు ఎప్పుడయినా రావచ్చును. ఆ డబ్బులు ఏ సమయంలోనయినా అడిగివట్టుకునిపోవచ్చును. నేను ముందే చెప్పానుగదా! ఈ ఇంటి తలుపులు నీవంటివారికొరకు ఎల్లవేళలా తెరిచేవుంటాయనీ. అందువలన దాన్నిగురించి నీవు అంతగా బాధపడవద్దు. నీకు సంశయాలూవద్దు. పీడితవర్గాల నాయకుడు పానయ్య ఎన్నడూ 'తనవాళ్ళ'కి అన్యాయంజెయ్యడు. అది గ్రహించు. వస్తానూ-' అని బక్కయ్య బుజ్జగించి- గేటుతలుపు తీయబోతూ- వెనక్కితిరిగి చూసాడు పానయ్య.

"ఇంకా అక్కడ్నేనిలబడివున్నావేంటి సోదరా? నీకు ఏమికావాలీ?" అ అనగా—

"దాహంగావుంది. మంచినీళ్ళుకావాలి"

పానయ్య మొహంలో విసుగుదల తొంగిచూడపోయింది. 'వేసవిలో పే ప్రజలకు మంచినీటికోసం వీధికొక పబ్లిక్కుళాయిని పెట్టించమని గత పదేళ లోనూ ఈ ప్రభుత్వాలతో వదసార్లు పోరాటాలు సాగించాం. కాని ప్రభుత్వ పట్టించుకోలేదు. దీనిగురించి మీవాళ్ళందరిదగ్గరా తలొక అర్జీరాయించి తెచ్చి నాక ఇవ్వు. ఈ సారి నేను హైదరాబాదు వెళ్ళినప్పుడు ఈవిషయమై వున్నతస్థాయిలో తీవ్ర చర్చలుజరిపి...."

"దాహంగావుందండి" నోరు అర్చుకుపోతూవుండగా- నీరసంగా అన్నాడ బక్కయ్య.

"ఆ సెంటర్లో అయ్యారు హోటలుంది. పీడితప్రజల నాయకుడు పానయ గారు చెప్పారని చెప్పి అడుగు. ఫ్రీగా నీక్కావలసినన్ని నీళ్ళిస్తాడు అతను తృప్తిగా తాగి, వెళ్ళి కష్టపడి సంపాదించుకో, ఏం? ఇంకా ఏంటీ అట్లాగేనిలబ చూస్తున్నావు? ఏంగావాలింకా?' పానయ్య విసుగ్గా అడిగాడు.

"ఈ మేడ మీదేనాండి?"

"అవునూ. నేనే స్వయంగా కష్టపడి సంపాదించి కట్టించుకున్నా నా కష్టార్జితం. నీకా 'డవుటెందుకు వచ్చింది నాయనా?'

"నా డవుటు అదిగాదండి. మాలాంటి లేనోళ్ళకి ఇట్టాంటి మేడల్లో వుం నీలాటి బాబులు చేసే సేవలు ఎట్లాటివా? అని?"

పానయ్య పొంగివచ్చిన కోపాన్ని తమాయించుకున్నాడు. తమాయించుకు 'ఇటువంటి విషయాలు మనం ఇట్లా బజార్లో బహిరంగంగా చర్చించుకోరాదు నా సహనాన్ని ఇంకా పరీక్షపెట్టి ఆ ఆగ్రహాన్కి నీవు గురవకముందే సెలవ దీసుకుని వెళ్ళిరా. తర్వాత కలుసుకుందాం. ఏం? అని గేటుతలుపుదీసి- లోపల వెళ్ళి మరల గేటు వేసి బోల్టుపెట్టేసి బక్కయ్యగురించి మళ్ళీ చూడటాన్కి సావ



సించకుండా, గిర్రున వెనుదిరిగి— గునగున అడుగులువేసి—

ఎండకీ, వుక్కకీ, చమటకీ—

ఆపసోపాలుపడ్తూ— రొప్పుతూ—

గబగబా వెళ్ళి మేడమీద ఏ.సీ. రూంలో ప్రవేశించబోయాడు పానయ్య. ఏ.సీ. రూంలో విశ్రాంతిగా—

పట్టెమంచంమీద పవ్వళించివున్న పత్ని పాపమ్మ— పానయ్యయొక్క ఛండాలపు అలవాట్లవలన గత కొన్నిసంవత్సరాలుగా ఎంతో బాధపడి మొహం వాచివున్నదైనందున అతన్ని గమనించగానే—

'కాళ్ళు-కాళ్ళు' అని అరిచింది కీచుగా.

"ఛీ. దీనెమ్మ! నా ప్రాణాన్ని కొరుక్కుదింటానికి దొరికిందిది. బ్రతక నీదూ చంపుకునిదింటంది." అని తిట్టుకుంటూ, కోపంగా బాత్‌రూంలోకి జొరబడి కాళ్ళూ చేతులూ మొహమూ సబ్బుతోపామి, కడిగి తువ్వాలుతో అద్దుకుంటూ— పానయ్య తిరిగి ఏ సీ. రూములో ప్రవేశించగానే-

"ఏదీ? తెచ్చారా?" అని అడిగింది పాపమ్మ ఆలస్యంచెయ్యకుండా చెయ్యి చాస్తూ.

"ఆఁ. తేకపోతే నువ్వూరుకుంటావా? క్రిందబెట్టి, మీదబెట్టి, కాలిడతీస్తే వేలికీ, వేలికితీస్తే మరలా కాలికీ మెలికలుబెట్టి - ఆ పొప్పరయిటర్ని ముప్పయి తిప్పలుబెట్టి మూడు చెరువుల నీరు తాగించి, చివరికి వేరేదారి వాడికి లేదనిపించి, వాడ్ని నాదారికి లాక్కునివచ్చి, ముక్కుపిండి వసూలుజేశాను! ఏడుపొక్కటే తక్కువ. వుసూరుమంటూఇచ్చి, భోరుమన్నంత పనినిజేశాడు." అని విజయ గర్వంతో వికటాట్టహాసంజేశాడు పానయ్య.

'మరాలస్యం దేనికి? తే తే.' అని చెయ్యిజాపింది పాపమ్మ నిష్కర్షగా.

లాల్చీజేబులు వెదికిన పానయ్య చేతులు నిశ్చలంగా అయ్యాయి. అతని మొహం తెల్లగా అయింది. శరీరంలో వణుకు ప్రారంభమయింది.


"ఏమిటా దొంగచూపులు? నాకు తెలవదా?!" గర్జించింది పాపమ్మ.

"ఏదీ? ఏదీ? జేబులోనేవుండాలే!" కంగారుపడ్డాడు పానయ్య.

"ఇంకెక్కడుంటుంది? త్రోవలోనే దానింటికివెళ్ళి అక్కడఇచ్చి దేబి ముఖంతోవచ్చి- నాదగ్గర నాటకాలాడతావెందుకు? ముదనష్టపోడా?!"

"అబ్బే లేదే. అక్కడికి వెళ్ళలేదు. పట్టు"

"అక్కడికి కాకపోతే ఇంకెక్కడికో పోయివచ్చివుంటావు! నీ బుద్ధి తగలబడ! ఛీ, ఛీ. ఇన్నేళ్ళువచ్చి- దున్నపోతులాగా శరీరాన్ని పెంచి ఏంతప




యోగం? మనిషన్నాక బుద్ధీ జ్ఞానం వుండాలి. మంచీ చెడూ చూడాలి. ఒక వెధవపని చేయటం- కూడునా కూడదా అన్న ఆలోచన వుండాలి. అది లేనినాడు పశువుకీ మనిషికి ఏమిటీ తేడా?"- ఉక్రోషంతో అట్లా పాపమ్మ-పట్టుకుని ఒక్క వూపున దులుపుతూవుంటే - వాట్ని దులపరించుకుంటూ - వేడివేడి నిట్టూర్పులు విడుస్తూ- దుఃఖం ఆవేశం పొంగి నరాల్లో రక్తం వేడెక్కి- ఉద్రేకం ఉరకలు వేసి, కోపం వరదలా పొంగివచ్చి - ఆయాసంతో వూగిపోతూ - వణికిపోతూ- చమట్లుగ్రక్కి-

"దొంగవెధవలు. అలుసిస్తే నెత్తినెక్కుతారు. ఇది ఆ బిక్కవెధవ పనే! ఆ రిక్షావెధవే ఆపనిచేసివుంటాడు. ఇప్పుడే వాడ్ని పట్టుకుని బుద్ధిచెపుతాను. నాలి ముచ్చునాయాలు. రక్తం కళ్ళజూస్తాను. పానయ్యంటే పిచ్చిముండాకొడుకని, పిచ్చిపిచ్చి ఆలోచనలుచేసి ఆపని చేసివుంటాడు! చితక్కొట్టి నెత్తురుకక్కిస్తే గాని వాడికి బుద్ధిరాదు. వాడిరిక్షాలో కూర్చునేగదా నేను కూల్‌డ్రింకు తాగి డబ్బులు ఇచ్చిందీ.... ముమ్మాటికీ ఇది ఆదొంగవెధవ పనే!"— అని గర్జించాడు పానయ్య.

"చాల్లే. ఇక నాటకం ఆపు. నువ్వు నీ డ్రామా నాటకాల్తో ఎవర్నయినా, మోసంచెయ్యగలవేమోగానీ, నన్నుమాత్రం మోసంచెయ్యలేవు. నీతో బాధలు పడీపడీ నా ప్రాణం సోషకొచ్చింది. అంతా మోసం, దగా, కుట్ర! నీవంటి దగా కోరుకి పెళ్ళిజేసి మావాళ్ళు నాగొంతు కోశారు. నా ఖర్మ. నా శ్రాద్ధం. నా...."

అంటూ పెద్ద గొంతుతో శెనడియన్ రయిలింజన్లాగా, పాపమ్మ అరవ సాగింది. పానయ్యని శాపనార్థాలు పెట్టసాగింది.

ఎర్రబడిన కన్నులతో—

ఉద్రేకంతో వూగిపోతూ—

రక్తం కక్కించటాయా- తెగిన పేగులూ—

కత్తిపోట్లుదృశ్యాయా— ఎర్రటి నెత్తుటిమడుగులూ—

తగలబడే ఇళ్ళూ—భయపడి పారిపోయే అసహాయులూ

బాధితుల ఆర్తనాదాలూ—రక్తాశ్రువులలా వాటా

—వీటిగురించే ఆలోచనలుచేస్తూ, ఎ.సీ. రూములోనుండి హాలులోకివచ్చి మెట్లుదిగి చరచరా క్రిందకిదిగి, ముందు వరండాలోకి వచ్చాడు పానయ్య. రాగానే అతని రోషకషాయిత అరుణారుణ నేత్రాలకి ఎదురుగా — చేతులు కట్టుకుని—

నుంచునివున్న బిక్కయ్యకన్పించాడు ఒక నల్లిలాగా, చీమలాగా.

అతని చేతిలో పానయ్య హాండ్‌బ్యాగు కన్పించింది.

"అయ్యా! మీ బ్యాగు రిక్షాలో పడిపోయింది. మీరు మర్చిపోయారు. తిరిగి ఇద్దామని వచ్చాను." అన్నయ్య బిక్కయ్యమాటలు వినపడినాయి అస్పష్టంగా. పానయ్య చెవులలో హోరుమని మోతలుపుట్టాయి.

అంతలోనే— .

భూమి గిర్రున తిరిగినట్లూ, దాంతోపాటు సమస్త ప్రపంచమూ వూగు తున్నట్లూ అనిపించింది, కుప్పగా కూలిపోతూ—

"బ్రదర్! నాకేమిటో అయిపోతోంది. నన్ను డాక్టర్‌దగ్గరకి తీసుకుని వెళ్ళు. నన్ను రక్షించుసోదరా!" — అని బ్రతిమాలాడు పానయ్య. దీనంగా చూసాడు. వణికిపోయాడు స్పృహదప్పిపోయాడు. ఆ బృహచ్ఛరీరాన్ని రిక్షాలోకి చేరవేసి, హాస్పటల్‌కి తీసుకునివెళ్ళే హడావుడిలో-

"పాపం! ఏమయిందో ఇతనికి ఇంతలోనే?! అందుకేగాబోలు అంటారు! 'నూరుగొడ్లని దిన్న రాబందు ఒక్క గాలివాటుకి పడిందని! ప్చ్! ఏమవుతాదో ఏమో!"— అనుకుని- శక్తికొద్దీ రిక్షాని గబగబాతొక్కి- పరుగులుదీయించాడు. బిక్కయ్య హాస్పటల్ దిక్కుగా.

ఎండ ఫెళ్ళున కాస్తూనేవుంది.